ప్రజాశక్తి
సోమవారం 9 అక్టోబర్ 2023 5
అనంతపురం

మొక్కజొన్న పంటపై అడవి జంతువుల దాడి

ప్రజాశక్తి-పుట్లూరు

అడవి జంతువులు మొక్కజొన్న పంటపై విరుచుకుపడ్డాయి. దీంతో సుమారు రూ.1లక్ష వరకూ పంట నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని ఎస్.గూడూరు గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి తనకున్న 1.20ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేశాడు. పంట కోసం సుమారు రూ.లక్ష వరకూ పెట్టుబడి పెట్టాడు. మరో నెల రోజులు ఆగితే పంట చేతికి వస్తుంది. ఈలోపు సుమారు 70 అడవి ఆవులు ఒక్కసారిగా మొక్కజొన్న పంటపై పడడంతో పంట మొత్తం ధ్వంసమైనట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వ అధికారులు స్పందించి పంట నష్టపరిహారాన్ని అందించాలని కోరుతున్నాడు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు వాసుదేవరెడ్డి

భూపోరాట రైతు ఆత్మహత్య

కొండూరులో దారుణం

భూపోరాటంలో సమిధలవుతున్న దళిత రైతులు

కనికరించని అధికారులు

చెట్టుకు ఉరివేసుకున్న వెంకటేష్

పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములు పెద్దల పరమవుతున్నాయి. తమ భూములను అక్రమంగా చేజిక్కించుకున్న కుశలవ కంపెనీ యాజమాన్యంపై లేపాక్షి మండలం కొండూరు రైతులు సాగిస్తున్న భూ పోరాటంలో రైతులు సమిధలు అవుతున్నారు. పెద్దలతో పోరాటంపై ఆందోళన చెందుతున్న నిరుపేద రైతులు తమ భూములు దక్కుతాయో లేదో అన్న దిగులుతో ప్రాణాలు వదులుతున్నారు. నిషేధిత జాబితాలో ఉన్నా వందల ఎకరాల భూములను కంపెనీ పేరిట 1బి ఖాతా సృష్టించిన రెవిన్యూ అధికారులు కుట్రలు, కుతంత్రలతో వారి పరం చేస్తుడడంతో పాటు రాత్రికి రాత్రే రికార్డులను సైతం మారుస్తుడడంతో పేద రైతుల్లో భయం అలుముకుంది. దీంతో బలవన్మరణాలకు దిగుతున్నారు. ఇలాంటి దయనీయమైన సంఘటన ఆదివారం శ్రీ సత్య సాయి జిల్లా లేపాక్షి మండలం కొండూరు సమీపంలో చోటుచేసుకుంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలంలోని కుశలవ భూముల విషయంలో దిగులు చెంది రెండు నెలల క్రితం తిప్పన్న చనిపోతే అతని కుమారుడు వెంకటేష్ (35) ఆదివారం వారికి కేటాయించిన భూముల్లో చెట్టుకు ఊరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ బాధితులు వారికి కేటాయించిన భూముల కోసం పోరాటం చేస్తు భూములు తమకు దక్కుతాయో లేదో అన్న దిగులుతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని దళిత రైతులతో పాటు సిపిఎం, కెవిపిఎస్ నాయకులు వాపోతున్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లేపాక్షి మండలం కొండూరు గ్రామ పంచాయతీ పొలంలో దాదాపు వందల ఎకరాల ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉన్న భూములను నిబంధనలకు విరుద్ధంగా కుశలవ యాజమాన్యం పేరిట ఖాతా నెంబర్ 14 65 లో వన్ బి మంజూరు చేసుకున్నారు. భూమిని చదును చేస్తామని లీజుకు ఇవ్వండని నమ్మబలికి ఏకంగా బడుగు బలహీన వర్గాల దళిత ఎస్సీ, ఎస్టీ భూములను కొట్టేసే ప్రయత్నం చేశారని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు పత్రాలను సృష్టించి తమ భూములు దక్కించుకోవాలని కుట్ర పన్నిన కుశలవ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటంలో భాగంగా కొర్లకుంట గ్రామ నివాసి కుశలవ భూ బాధితుడు, దళిత యువరైతు కుశలవ ఆక్రమణలో ఉన్న తన సొంత పొలంలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతిచెందిన యువరైతు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కుశలవ కంపెనీ అక్రమాలపై అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి అసైన్డ్ చట్టం ప్రకారం నాడు ప్రభుత్వం ఎవరికి భూములను కేటాయించిందో వారికి ఇవ్వాలని లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రైతు ఆత్మహత్య వార్త తెలిసిన వెంటనే లేపాక్షి తహశీల్దార్ కె.బాబు, రూరల్ సిఐ వేణుగోపాల్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

పెనుకొండ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై డిటోనేటర్‌తో దాడి

పోలీసుల అదుపులో నిందితుడు

ప్రజాశక్తి గోరంట్ల రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పెనుగొండ ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర నారాయణ కారుపై ఆగంతకుడు ఎలక్ట్రికల్ డిటోనేటర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఆదివారం గోరంట్లలో జరిగిన ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గడ్డం తండా పంచాయతీలోని కల్లితండాలో జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి కారులో బయలుదేరాడు. కల్లితండాకు చేరుకున్న శంకరనారాయణ తన వాహనం దిగి కొంత దూరం వెళ్లగానే పక్కనే ఉన్న ఆగంతకుడు ఎలక్ట్రికల్ డిటోనేటర్‌ను ఎమ్మెల్యే వాహనంపై విసిరాడు. గమనించిన డ్రైవర్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సిఐ సుబ్బరాయుడు కారువద్ద పడిఉన్న డిటోనేటర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అయితే ఈ సంఘటనతో నాయకులు, గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరానారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా పెనుకొండ నియోజకవర్గంలో ఎలాంటి ఫ్యాక్షన్‌కు తావివ్వకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పాలన అందిస్తున్నాని అన్నారు. అయితే ఇది గిట్టనివారు ఇలాంటి పనికి ఒడిగట్టారని విమర్శించారు. ఈఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజానిజాలను బయటకు తీయాలని కోరాడు. ఈ సంఘటనపై సిఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ సోమందేపల్లి మండలం గుడిపల్లి గ్రామానికి చెందిన గణేష్ నాసన్ లో రాళ్ల తొలగించే వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని చెప్పారు. అయితే ఆదివారం అతిగా మద్యం సేవించి వెళ్లడంతో కాంట్రాక్టర్ రమణ గణేష్‌ను పనిలోకి పిలుచుకోలేదన్నారు. దీంతో గణేష్ సోమందేపల్లి మండలం నుండి వాహన ర్యాలీకి వస్తున్న ద్విచక్ర వాహనాలలో వచ్చి ర్యాలీలో పాల్గొని తిరిగి కల్లితండాకు చేరుకొని తన జేబులో ఉన్న డిటోనేటర్‌ను మద్యం మత్తులో విసిరాడని వివరించారు. ఈఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందన్నారు. ఎమ్మెల్యేపై దాడి సమాచారం అందుకున్న శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా గోరంట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జరిగిన సంఘటనపై సిఐ సుబ్బరాయుడుతో సమీక్షించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పూర్తిస్థాయిలో విచారణ అనంతరం వివరాలు మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరానారాయణ సోదరులు మల్లికార్జున, రవీంద్ర తదితరులు గోరంట్లకు వచ్చి పరిస్థితినిఅడిగి తెలుసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు గణేష్

గోరంట్ల పోలీసుస్టేషన్ వద్ద ఎస్పీ, తదితరులు

ఉపాధ్యాయుల శిక్షణను

వాయిదా వేయాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనన్న శిక్షణ కార్యక్రమాలను తాత్కాలికంగా వాయిదా వేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిదినాల్లో తీరికలేకుండా అనేక ప్రభుత్వ కార్యక్రమాలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. దసరా సెలవుల్లో ఉపాధ్యాయులు కాస్త ఊరట పొందొచ్చు అని ఆశతో ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం పేరుతో దసరా సెలవులు కూడా హరించి వేయడం ప్రభుత్వానికి తగదన్నారు. వెంటనే విద్యా శాఖ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి అక్టోబర్ 16 తేదీ నుంచి నిర్వహించనున్న రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని తక్షణమే వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.రఘురామిరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు డి.ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, జిల్లా గౌరవ సలహాదారు బి.వెంకటేశులు, అసోసియేట్ ప్రధాన కార్యదర్శి బి.హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలను బలపర్చండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళల పక్షాన పోరాడుతూ సామాజిక న్యాయం, సాధికారత కోసం పనిచేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను బలపరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఈ నెల 23 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నిర్వహించే సిపిఎం రాజకీయ క్యాంపియన్‌లో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం నగర కమిటి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసి ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు ప్రజలను మళ్లించడం కోసమే సిపిఎం రాజకీయ క్యాంపెయిన్ చేస్తోందన్నారు. ప్రశ్నించే వారి గొంతును నరేంద్ర మోడీ ప్రభుత్వం నొక్కుతోందన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారి మీద దేశద్రోహం చట్టాలను మోపి జైలుకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదన్నారు. అధిక ధరలు అరికట్ట లేదని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేదని అన్నారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ ధానాన్ని దోచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తే వారిపై కేసులు బనాయించి బెదిరిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయాలు చూస్తే గతంలో ఎప్పుడు లేని విధంగా దారుణంగా తయారయ్యాయని విమర్శించారు. ఈ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర అభివృద్ధి కోసం జిల్లాల్లో సదస్సులను పెట్టి ప్రజలను, మేధావులను, రైతులు, కార్మికులు , మహిళలు, నిరుద్యోగులను కలుపుకొని పోయే విధంగా కార్యక్రమాలను సిపిఎం రూపొందిస్తుందని తెలిపారు. సిపిఎం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వెంకట నారాయణ, ముస్కీన్, నగర కమిటీ సభ్యులు ప్రకాష్, వలీ, మసూద్, రాజు, వెంకటేశు, ఎర్రిస్వామి, గఫూర్, తిరుమలేశు, లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, రాముడు, షరీఫ్, నాగేంద్ర, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రచార ఉద్యమం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో సూడోసైన్స్ భావాలు, మూఢనమ్మకాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో శాస్త్రీయ ప్రచారాన్ని ఉద్యమంగా చేపడుతున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. జెవివి జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. జెవివి జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ అక్టోబర్ 8వ తేదీ నుంచి 6 నెలల పాటు సమాజంలో శాస్త్రీయ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాయాత్రలు, సదస్సులు, మ్యాజిక్ షోలు, వర్క్ షాపుల ద్వారా శాస్త్ర ప్రచార ఉద్యమాన్ని విద్యార్థుల్లోకి తీసుకువెళుతున్నట్లు వివరించారు. జిల్లాలో శాస్త్ర ప్రచార కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. జన విజ్ఞాన వేదికలో వివిధ విభాగాలు తమ కమిటీలను ఎంపిక చేసుకుని, కార్యకలాపాలు ప్రారంభించాలని కోరారు. ప్రజాతంత్ర పనివిధానాన్ని అందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చెకుముకి సంబరాల ద్వారా హైస్కూల్ పిల్లల్లో సైన్సు పట్ల ఇష్టాన్ని పెంపొందింప చేయాలని కోరారు. జిల్లాలో సైన్సు ప్రచారం పట్ల ఆసక్తి ఉన్నవారందరూ జెవివిలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కర్, కోశాధికారి జిలాన్, కార్యదర్శివర్గ సభ్యులు రఘురామయ్య, చిత్తప్ప, వీరరాజు, రామిరెడ్డి, ప్రసూన, విజయలక్ష్మి, జగదీష్‌తో పాటు యూత్, సోషల్ మీడియా, మ్యాజిక్, కల్చరల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఐఎంఎ హాల్‌లో 'ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అనే' అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన చర్చా వేదికకు పలు సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరయ్యారు. ప్రజారోగ్య వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొండయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధికంగా నిధులు కేటాయించి మెరుగైన వైద్యం క్షేత్రస్థాయిలో అందేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం సిహెచ్‌లు, పిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లు పటిష్ట పరుస్తూ సామాన్య పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం చేరువయ్యేందుకు కృషి చేయాలన్నారు. విద్య వైద్య రంగాల్లో పూర్తిస్థాయి ప్రభుత్వ భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రజారోగ్య వేదిక అధ్యక్షులు డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ప్రజారోగ్య వేదిక ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజలకు క్షేత్రస్థాయిలో వైద్యం అందేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. సుమారుగా 16 మండలాలు, మూడు పట్టణాల్లో ప్రజారోగ్య వేదిక ద్వారా సర్వే చేసి ప్రజాభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. మూడు క్యాటగిరీలుగా చేసిన ఈ సర్వేలో ప్రజలు 75శాతం విద్య వైద్యానికి ఖర్చు చేస్తున్నట్లు తెలియవచ్చిందన్నారు. ప్రజారోగ్య వేదిక కార్యదర్శి శ్రీనివాస రావు మాట్లాడుతూ అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు వైద్యం అందుతుందని తెలిపారు. నేడు వైద్యం ఖరీదైన వస్తువుగా మారిందని ప్రభుత్వం ఆలోచించి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ వైద్య రంగంలో ముఖ్యంగా ప్రభుత్వ వైద్య సేవల విషయంలో లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిధుల లేమి పేరుతో ప్రజలకు సేవలు అందించకుండా దాటవేత ధోరణితో ప్రభుత్వం వ్యవహరించడం సరైనది కాదన్నారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రతిష్ట పరిచేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విధానాలను పరిశీలించి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్, సామాజికవేత్త నబిరసూల్, రామకృష్ణ, ఎల్ఐసి నాయకులు రామకృష్ణ, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రాజమోహన్, జాయింట్ కన్వీనర్ ఎంఎన్‌టి రాజు, ప్రజాశక్తి బుక్ హౌస్ సిబ్బంది రాయుడు, యుటిఎఫ్ నాయకులు జిలాన్, ఎపిఎంఎస్ఆర్‌యు రాజేష్, పలు సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

కూలీలందరికీ ఉపాధి

డిడబ్ల్యూఎంఎ పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలు పనులు కల్పించి వలసలు నివారించడమే తమ ప్రథమ కర్తవ్యమని శ్రీ సత్య సాయి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. కూలీలకు అనుగుణంగా వారికి ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందుకోసం శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం, ల్యాండ్ లెవెలింగ్ తదితర పనులు చేపట్టి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న: ఈ ఏడాదిఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికలు తీసుకుంటున్నారు.?

జవాబు : ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 54 లక్షల పని దినాలను కల్పించాం. అందుకోసం రూ.1.30 కోట్లు ఖర్చు చేశాం. జిల్లా వ్యాప్తంగా 50 వేల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా పండ్ల తోటలు పెంపకం కార్యక్రమం చేపట్టాం. ఇందుకోసం ఉపాధి పథకం ద్వారా మూడు సంవత్సరాలు పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు ప్రోత్సాహం ఇస్తున్నాం. ఉపాధి పనుల ద్వారా వలసలు నివారిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కావాల్సిన పనులను గుర్తింపు కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరుపుతున్నాం. జియోగ్రఫీ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ వ్యక్తిగత పనులను గుర్తించి, అంచనాలు తయారు చేసి పరిపాలన అనుమతులు తీసుకొని పనులు కల్పిస్తున్నాం.

ప్ర: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా ఏయే పనులు జరుగుతున్నాయి?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 6వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని నిర్ణయించాం. 15 రకాల పండ్ల మొక్కలు రెండు రకాల కాయగూరలు పెంపకం కోసం రైతులకు ఉపాధి హామీ ద్వారా అవకాశం ఇస్తున్నాం. ఇప్పటికే రెండువేల ఎకరాలు పూర్తి అయింది. 15 రోజుల్లోపు 4వేల ఎకరాల పండ్ల తోటల పెంపకం పూర్తి అవుతుంది. చెత్తతో సంపద కేంద్రాల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. వాటితోపాటు రోడ్డు పనులు కల్పిస్తున్నాం.

ప్ర : నీటి సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : జిల్లా వ్యాప్తంగా వర్షపు నీటి నిల్వ కోసం చెరువులు కుంటలలో పూడికతీత పనులు చేపట్టాం. మూడు వాటర్‌షెడ్లు ఏర్పాటు చేశాం. ధర్మవరం మండలం ఏలుకుంట్ల, ఎన్పీ కుంట మండలం మర్రి కొమ్మదిన్న, పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామాల్లో వాటర్‌షెడ్ పనులు చేపట్టాం. వాటి ద్వారా 50 కోట్ల రూపాయల నిధులతో చెరువుల్లో పూడికతీత పనులు, చెక్ డాముల నిర్మాణం, రాక్ ఫీల్డ్ డ్యాములు, కందకాలు తదితర పనులతో పాటు ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, ఉన్నత పాఠశాలలు, గ్రామ సచివాలయాల వద్ద వర్షపునీరు నిల్వ చేయడానికి ఇంకుడు గుంతలను జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 350 నిర్మించాం. వాటికి ఒక్కొక్క దానికి రూ. 50 వేల నుండి లక్ష రూపాయల దాకా ఖర్చు చేస్తున్నాం. దీనిద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందడమే కాక చుట్టుప్రక్కల బోర్లు రీఛార్జి కానున్నాయి.

ప్ర : ఉపాధి హామీ పథకంలో జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అవినీతిపై మీ సమాధానం?

జ : ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లింపు జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండటంతో ఈ జాప్యం జరుగుతోంది. ఉపాధి కూలీలు పనులు విషయంలో అవినీతి జరగడానికి ఆస్కారం లేదు. చాలా చోట్ల అవినీతిపై విచారణ చేపట్టాం. దానికి తోడు సామాజిక తనిఖీలు ప్రతి సంవత్సరం నిర్వహించి ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా అందులో అవినీతి బయటపడిన వెంటనే సొమ్ము రికవరీ చేస్తున్నాం. కొంతమంది గ్రామంలో లేనివారు ఉపాధి బిల్లులు పొందుతున్నారని తమ దృష్టికి రావడంతో ఆ గ్రామాలకే వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అందులో ఎలాంటి అవినీతి జరగలేదు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఖోఖో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పుల్లారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

నేటి విద్యార్థులు విద్యతోపాటు ప్రావీణ్యం ఉన్న క్రీడల్లో రాణించాలని ఖోఖో క్రీడాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండలోని ఎస్.కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఖోఖో జూనియర్ క్రీడా విభాగంలో బాల బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 250 మంది పాల్గొనగా అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19న చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో ఆమిద్యాల వీరశేఖర్, హరికృష్ణ, మోపిడి మహేంద్ర, వంశీ, ఉరవకొండ గౌతమ్, అజయ్‌కుమార్, సుదర్శన్, అనంతపురం అనిల్‌కుమార్, నాగలాపురం అంజి, మహేంద్ర, లోకేష్, కొండాపురం గణేష్, గుంతకల్లు అభిషేక్‌ను ఎంపిక చేశారు. అదేవిధంగా జూనియర్ బాలికల విభాగంలో నాగలాపురం కె.సంధ్య, స్వప్న, హారిక, మౌనిక, రితిష్య, సోనిక, ఉరవకొండ శ్రావణి, చైతన్య, ధనలక్ష్మి, ఆమిద్యాల సునీత, మోపిడి ఐశ్వర్య, శాంతి, గుంతకల్లు సంధ్య, అనంతపురం రషీదాను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మారుతీ ప్రసాద్, రాజేష్, రాంభూపాల్, ప్రభాకర్, మంజునాథ్, జనార్ధన్, రాఘవేంద్ర, సురేష్, మాధవి, శర్మస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సేవాసంఘం నూతన కమిటీ ఎన్నిక

గుత్తి : పట్టణంలోని సర్ థామస్ మన్రో సత్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం కమ్మ సేవాసంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డిసి. వెంకటనాయుడు, అధ్యక్షులుగా గోరంట్ల నాగరాజు, ఉపాధ్యక్షులు గూడూరు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి కోనంకి కష్ణ, సహాయ కార్యదర్శి ఎస్. మల్లికార్జున నాయుడు, కోశాధికారి మచ్చా రంగస్వామి ఎన్నికయ్యారు.అనంతరం ఎన్నికైన నాయకులను పలువురు పూలమాలలతో సత్కరించారు.

13న మండల సర్వసభ్య సమావేశం

శింగనమల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 13వతేదీన ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నిర్మలాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ అధికారులు ఆయా శాఖల అందించే సంక్షేమ పథకాల సమీక్ష నివేదికలతో తప్పక హాజరుకావాలని కోరారు.

In the Court of the Hon'ble District Judge: Ananthapuramu

E.P.No.123/2022 in O.S.No.22/2010

Between:

M/s. Margadarsi Chit Fund Pvt. Ltd., Kadapa Branch. ...Petitioner

V/s

K.Venkata Ramana and others ...Respondants

To,

JDr.2: T.Venkata Seetha Ramaiah, S/o T.Jagan Mohan Rao, M/s. R.S. Fshions, D.No.15/24, Raju Road, Ananthapurar, R/o. H.No.10/219, Upstairs, Adimurthy Nagar, Anantapur.

02వ రెస్పాండెంట్/JDr.2 ఆస్తి వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా జెడిఆర్.2కు చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని కోర్టువారు వేలము వేయదానికి గాను 20-10-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున కొనదలచినవారు 20-10-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై కోర్టు షరతులకు లోబడి వేలమునందు పాల్గొనవచ్చును.

SCHEDULE

Anantapuramu District Registration, Anantapuramu Sub Registry, Anantapuramu Town Municipal Corporation area. Drivers Colony (495 to 573) SEG.39, Survey No.448/1, Plot (vacant site), Ward No.28, AC.1.20 Paiki, A.C.0.32.25 Hectors 0.134.

Item: Vacant site Extents 1555.55 Sq.Yards.

Value: Rs.5,00,000/-. Boundaries: North: Road, South: Remaining Plot & House in the same Survey No. East:Road, West:Road. Measurements: East to West: 140 Feet, North to South:100 Feet.

DHr. Value:5,00,000/-

Ameena Value: 24,00,000/-

(By Order of the Court)

Rajasekhar Boyapati
Advocate for DHr.
Anantapuramu, Cell: 9440221213.

In the court of the Hon'ble Addl.Senior Civil Judge, Ananthapuramu

I.P. No:68/2022

Between:

Bogathi Bayapa Reddy ...petitioners

and

1.Pinjari Lal Bee
2.C.Ramalingamma ...Respondants

Notice to Respondant No: 1

To,

R1:Pinjari Lal Bee W/o P.Kullayappa, D.No:1-853/58, Indiramma Colony, B.K.Samudram, (V) & (M), Ananthapuramu,

పై కనబరచిన I.P.No:68/2022 లో 1వ ప్రతివాది హాజరు నిమిత్తం 06/11/2023వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

అల్లు నారాయణప్ప
అడ్వకేట్, అనంతపురం సెల్:9908616177

In the court of the 1st Addl.Junior Civil Judge, Ananthapuramu

O.S. No:1676/2022

Between:

D.Venkataramudu ...plaintiff

and

1.V.Surya Nagaraju
2.V.Phani Bhaskar ...Defendants

Notice to Defandant No: 2

To,

D2:V.Phani Bhaskar S/o Late V.Subramanyam, Flat No:202, Mourya Residing, ...Market, Mangalore, Karnata State.Now R/at Singanamala (V) & (M), Ananthapuramu Dist.

పై దావాలో రెండవ ప్రతివాది హాజరు నిమిత్తం 17/10/2023వ తేదికి వాయిదా ఉన్నది.కావున ఆ రోజు నీవు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

అల్లు నారాయణప్ప
అడ్వకేట్, అనంతపురం సెల్:9908616177

In the court of the III Addl.Junior Civil Judge, Ananthapuramu

O.S. No:477/2022

Between:

Mellaputi Pola Naidu ...plaintiff

and

Pothuru Mallikarjuna (Died) by His Leagal Heir i.e P.Krishnaveni ...Defendants

Notice to Defandant

To,

పొత్తూరి క్రిష్ణవేణి భర్త లేటు పి.మల్లికార్జున, డోర్ నెం:7-664, రహమత్ నగర్, అనంతపురం,

పై దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం 09/11/2023వ తేదికి వాయిదా ఉన్నది.కావున ఆ రోజు నీవు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

అల్లు నారాయణప్ప
అడ్వకేట్, అనంతపురం సెల్:9908616177

ఒపిఎస్ అమలు చేయాల్సిందే..

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకంగా ఉన్న జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.లింగమయ్య, వి.గోవిందరాజులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ స్థానంలో ఓపిఎస్ అమలు చేయకుండా జిపిఎస్ అంటూ ఏకపక్షంగా అమలుకు సిద్ధమైందన్నారు. జిపిఎస్ విధానంతో కూడా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. సిపిఎస్ విధానానికి జిపిఎస్ విధానానికి ఏమాత్రం వ్యత్యాసం లేదన్నారు. అలాగే సర్వ శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులు సిఆర్‌పిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్‌టి, ఆర్ట్, క్రాఫ్ట్ సిబ్బందికి మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మందికి జీతాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వివి.రమణయ్య మాట్లాడుతూ ఇప్పటికీ చాలా మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదని, వెంటనే వారందరికీ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నెల రోజులుగా పని చేసిన ఉద్యోగికీ 1వ తేదీన జీవితం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీనే జీతాలు చెల్లించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు రామప్ప చౌదరి, సరళ, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, అబ్దుల్ వహాబ్ ఖాన్, రాముడు, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

జగనన్ననే మళ్లీ సిఎంగా చేసుకుందాం

ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పేదల పక్షపాతిగా నిలిచిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం అనంతపురంలోని కెటిఆ ర్ ఫంక్షన్ హాల్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కుల, మత, పార్టీలు చూడకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తోందన్నారు. శింగనమల నియోజకవర్గం ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. టిడిపి హయాంలో నీళ్లు అడిగినందుకు తనపై, నాయకులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో ఎవ్వరి మీద కేసులు పెట్టలేదన్నారు. కానీ నమ్మకంతో గెలిపించిన ప్రజలకు నియోజక వర్గంలో సాగు,తాగు నీరుకు ఇబ్బంది లేకుండా చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా నెరవేరని శింగనమల చెరువును లోకలైజేషన్ చేయించామన్నారు. గతంలో టీడీపీ అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందలేదు కాబట్టే, ప్రజలకు వారిమీద నమ్మకం కోల్పోయి గద్దె దింపారన్నారు.2014- 19 మధ్య చంద్రబాబు ఇచ్చిన 600 హామీలు నెరవేర్చలేదని, కానీ 2019 నుంచి సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. ఈ హామీలు, నవరత్నాల వివరాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ, సచివాలయాల స్థాయిలో వైసిపి జెండా ఎగరవేసి పల్లె నిద్ర చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, జడ్పిటిసి భాస్కర్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రేకులకుంట సాకే రామకృష్ణ, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, కాలవ వెంకటలక్ష్మి, దయ్యాల కుంటపల్లి శివారెడ్డి, ఎంపిటిసి చిన్నపరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, గృహసారథులు, మండల కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి

మృతిచెందిన శ్రీరాములు

బుక్కరాయసముద్రం : మట్టి తోలుతూ ప్రమాదవశాత్తు కింద పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పరపల్లి దగ్గర ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇటుకపల్లికి చెందిన శ్రీరాములు (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా సిద్ధలాపురం నుంచి ఉప్పరపల్లికి మట్టిని తీసుకెళ్లేందుకు వస్తుండగా కొత్తపల్లి-ఉప్పరపల్లి మధ్యలో వేగంగా వస్తూ ప్రమాదవశాత్తు ఎగిరి కింద పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఇటుకులపల్లి ఎస్ఐ ఆర్.బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించాడు. అనంతరం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తప్పిపోయిన పుల్లారెడ్డి

బుక్కరాయసముద్రం : మండలంలోని రేగడికొత్తూరు గ్రామంలో నివసిస్తున్న వ్యక్తి తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. ఉదయగిరి కొత్తూరు గ్రామ నివాసి వద్దిరెడ్డి పుల్లారెడ్డి రేగడికొత్తూరులో నివసిస్తున్నాడు. ఈనేపథ్యంలో గతనెల 16న రాత్రి ఇంటి నుంచి దుస్తులు సర్దుకుని బాటలో సుంకులమ్మ ఆలయానికి బయలుదేరని వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

సెబ్‌పోలీసుల దాడులు

వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు సెబ్ పోలీసులు ఆదివారం మెరుపుదాడులు నిర్వహించారు. ఒకరిని అరెస్టు చేయడంతో పాటు 30 టెట్రా పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. గుత్తి సెబ్ స్టేషన్ పరిధిలో డీపీఎల్ కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసి 8 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. తాడిపత్రి సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేశారు. మూడు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మృతిచెందిన వ్యక్తి

అనంతపురం క్రైం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో మృతి చెందాడు. మద్యానికి బానిసైన వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంచరించేవాడని త్రీ టౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించినప్పటికీ స్థానికుల సమాచారం మేరకు భవానీనగర్‌కి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

అవినీతి బురద అందరికీ అంటిస్తున్న సిఎం జగన్

టిడిపి దీక్షల్లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రజాధనం దోపిడీ చేసుకున్న సిఎం జగన్ అందరికీ అవినీతి మరకలు అంటించే దుర్మార్గపు విధానాలను అనుసరిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి విమర్శించారు. చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి అనంతపురం నియోజకవర్గం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సందర్శించి మాట్లాడుతూ సిఎం జగన్ 16 నెలలు జైలులో ఉండి తన అవినీతి బురదను ఇతరులకు అంటించాలని చూస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే చంద్రబాబును అక్రమంగా రిమాండ్ కు తరలించారన్నారు. ఇప్పటికే నెల రోజులు పూర్తవుతోన్న, జైలులో ఉంచి కేసును దర్యాప్తు చేస్తున్నామని, సిఐడి అధికారులు పేర్కొనడం అన్యాయంగా ఉందన్నారు. తమకు న్యాయశాఖపై నమ్మకం ఉందని, మచ్చలేని వ్యక్తిగా చంద్రబాబు బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ దీక్షలో మార్కెట్ మహేష్, సరోజమ్మ, డాక్టర్ లక్ష్మీప్రసాద్, రఘు, ఇజాజ్, జ్యోతి, సున్నం శ్రీనివాసులు చేపట్టారు.

పలువురి సంఘీభావం

రిలే నిరహార దీక్షలకు టిడిపి సీనియర్ నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, బుల్లె శివ బాల, గౌస్‌మొద్దీన్, గాజుల ఆదెన్న, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్ యాదవ్, లింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : చంద్రబాబు అక్రమ అరెస్టుపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహ జ్వాలలు నెలరోజులైనా చల్లారలేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాయదుర్గంలోకమ్మ సామాజిక వర్గం తరపున ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత టిడిపి కార్యాలయం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయంగా వేధిస్తున్న జగన్ వచ్చే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వేలాది మంది ఐటి ఉద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మార్గదర్శకుడు చంద్రబాబుకు లక్షలాది మంది మద్దతు పలుకుతున్నారన్నారు. 13 కేసుల్లో ప్రధాన ముద్దాయిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డిని వేలకోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న ఆర్థిక నేరస్థుడుగా సీబీఐ గుర్తించిందన్నారు. సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో తమ నాయకుడికి సముచిత న్యాయం లభిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాయదుర్గం పార్టీ పరిశీలకులు పర్వీన్ తాజ్ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న ఆదరణ, అభిమానం చూడలేక జగన్ రాజకీయ కక్షతో చంద్రబాబును అన్యాయంగా జైలు పాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, లాలెప్ప, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చంద్రహాష్, అది, బసవరాజు, తిమ్మరాజులు, వెంకటేశులు, ధనుంజయ్య, వెంకటేశులు, మల్లికార్జున, మహేంద్ర, పోట్ల రవి, చంద్రకాంత్, అనిల్, నరేంద్రచౌదరి, జయరాం చౌదరి, అప్పారావు, బాబు, భాస్కర్, కేశవ్ రెడ్డి, నవీన్, సోము, కాటా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు తెలిపారు. మండల కేంద్రం సమీపంలో 'బాబు తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం' ఎంఎస్.రాజు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక సిఎం జగన్ ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడినా పట్టించుకునే నాయకుడే లేకుండా పోయాడన్నారు. సిఎం జగన్ కేవలం ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ రాజకీయ కక్షసాధింపు చర్యలను మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. దీక్షకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, అధికార ప్రతినిధులు దేగల కృష్ణమూర్తి, పర్వతనేని శ్రీధర్‌బాబు, నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, రామలింగారెడ్డి, బుల్లే శివబాల, మారుతీనాయుడు, శ్రీనివాసులు, మాసూల చంద్రమోహన్, వెంకటేష్, కొయ్యగూర పెద్దన్న, నరేంద్రకుమార్‌యాదవ్, రాజు తదితరులు మద్దతు తెలిపారు.

ఎంఎస్.రాజు నిరవధిక దీక్షలో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

నార్పల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు మండల కేంద్రంలో చేపట్టిన రిలేనిరాహారదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ అవినీతి బురదలో నిండా మునిగిన జగన్ ఆ బురదను అందరికీ అంటించేందుకు పన్నిన కుట్రలో భాగమే చంద్రబాబు అరెస్టు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేల చంద్రబాబుని అరెస్టు చేసి జైలులో పెట్టడం జగన్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. దీక్షలకు జనసేన, సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ రామకృష్ణ, జనసేన నాయకులు షేక్ రహంతుల్లా, సంగా అశోక్, బాబాఆలీ, నడిమిదొడ్డి అశ్వర్థరెడ్డి, దాడితోట శివయ్య, సుబహాన్, రమణయ్య, ఉప్పు రాము, వినోదం లోకేష్, సాకే రాజు, శ్రీధర్‌బాబు, సిపిఐ మండల కన్వీనర్ గంగాధర్, వైస్ మండల కన్వీనర్ భాస్కర్, రామయ్య, జెఎస్‌పి లోకేష్, పెద్దన్న, శ్రీన, నాయకులు పిట్టు రంగారెడ్డి, నాగప్ప, రాఘవనాయుడు, చంద్రబాబు, బొగ్గు నారాయణస్వామి, పిఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుల్లాయప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు మండలంలో పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

20న వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

పుట్లూరు : తాడిపత్రి పట్టణంలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు సంబంధించిన పోస్టర్లను వాల్మీకి సంఘం నాయకుల ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, రాష్ట్ర కార్యదర్శి దొడ్లో హనుమంతు, సంకేపల్లి రామాంజనేయులు, పోతులయ్య, రాజ, వెంకటేష్, రవి, ఆది, కుమ్మనమల నారాయణస్వామి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్టాన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం నార్పల మండల కేంద్రంలోని వాల్మీకి మహర్షి గుడిలో వాల్మీకి సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20న తాడిపత్రిలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు తెఇపారు. కావున భారీ ఎత్తున వాల్మీకి సోదరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు, ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర కార్యదర్శి యల్లనూరు దొడ్లో హనుమంతు, తాడిపత్రికి చెందిన సంకేపల్లి రామాంజనేయులు, పోతులయ్య, రాజ, నార్పలకు చెందిన బాలనాగి శీన, జయచంద్ర, నిమ్మకాయల ప్రసాద్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయంలో శ్రమదానం

గుత్తి : పట్టణంలోని గుత్తి కోట ముఖద్వారం వద్ద ఉన్న పురాతన శివాలయంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. పచ్చదనం-పరిశుభ్రత-మేలుకొలుపు కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి సేవాసంస్థ నాయకులు నగరేశ్వర ఆలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సేవాసంస్థ కన్వీనర్ ఎంవి.రమణ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, నిర్మలమైన మనసు స్వీయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. సమాజానికి పరిశుభ్రమైన వాతావరణం ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. సాయి యువజన సమితి కన్వీనర్ చిన్ని గణేష్ మాట్లాడుతూ ప్రపంచ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రమదానానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి భజన మండలి నాయకులు, మాజీ సైనికులు కేవీ.నారాయణ, ఉపాధ్యాయుడి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల నిరసన

గుత్తి : ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్ల భవనంలో విశ్రాంత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతినెలా 15 రోజులు గడిచినా పూర్తిస్థాయిలో విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ అందడం లేదన్నారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో ఉన్న తమకు సకాలంలో పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి విశ్రాంత ఉద్యోగులు సకాలంలో పింఛన్లు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, సాయి, కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

ముప్పాలగుత్తిలో రైతుప్రదర్శనా క్షేత్రం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రస్తుత కరువు పరిస్థితుల్లో బెట్టను తట్టుకుని రైతుకు వందశాతం దిగుబడులు అందించే జయభేరి పత్తివిత్తనాలు సరైనవని సంస్థ జోనల్ మేనేజర్ హనుమంతరావు, ఏరియా మేనేజర్ చాణిక్యప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని ముప్పాలగుత్తి గ్రామంలో వ్యవసాయశాఖ సలహా మేరకు రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన రైతు గంగరాజు మూడెకరాల పొలంలో సాగు చేసిన జయభేరి రకం పత్తి పంటను పరిశీలించారు. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగి బెట్టను తట్టుకోవడంతోపాటు వర్షాభావ పరిస్థితులు, గులాబీ రంగు పురుగు లేకపోవడం కూలీలకు తేలికగా పత్తి తీయుట వంటి అంశాలు ఉండటం వల్ల రైతుకు మంచి దిగుబడులు వచ్చే సూచన కనిపిస్తోందని పలువురు ఆశాభాం వ్యక్తంచేశారు. వ్యవసాయశాఖ సూచనల మేరకు ఏర్పాటు చేసిన ప్రదర్శ క్షేత్రాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి పత్తిపంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జయభేరి సంస్థ ప్రతినిధులు, ఆదిత్య, ఆయూష్ ట్రేడర్లు అదినేతలు లాయరు సుంకిరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఉమ శ్రీరంగరామమోహన్, ఎస్వో జయకష్ణ, పలుగ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నాడు.

పత్తిపంటను పరిశీలిస్తున్న జయభేరి సంస్థ ప్రతినిధులు

ఘనంగా వాయుసేన దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హెచ్‌ఎల్‌సి కాలనీలో ఉన్న మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో ఆదివారం 91వ వాయుసేన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్యంలో పని చేసి పదవీ విరమణ పొందిన వాయుసేన మాజీ సైనికులు సార్జెంట్ శ్రీనివాసులు, సార్జంట్ నాగభూషణం, మాస్టర్ వారెంట్ ఆఫీసర్ బషీర్ అహ్మద్, సార్జెంట్ ఆర్ఎస్ నాగరాజ్, జూనియర్ వారెంట్ ఆఫీసర్ టికె కృష్ణ,, సార్జెంట్ సంజీవకుమార్ తదితరులు వాయుసేనలో చేసిన సేవలను వివరించారు. అనంతరం కెప్టెన్ షేకన్న మాట్లాడుతూ వాయుసేన ఏర్పడిన 1932వ సంవత్సరం నుంచి గడిచిన 91ఏళ్లలో దేశం మీదికి వచ్చిన శత్రుసేనలను తరిమికొట్టిడం, ప్రపంచంలో ఎక్కడైనా అశాంతి నెలకొన్న సమయంలో యుఎన్ఒ ద్వారా శాంతి నెలకొల్పడటం వంటి సేవలు చేస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వరదల సమయంలో, టెర్రరిస్టులు, ఏర్పాటు వాదులను ఏరివేసే సమయాల్లో సాహసోపేతమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, అబ్దుల్‌ఖాదర్, ఇస్మాయిల్ షఫీ, బాలస్వామి, మహబూబ్ పీరా, రమణరావు, ఇర్షాద్ అహ్మద్, సిద్ధన్న, మొయిద్దీన్, వై.ప్రసాద్, నబిరసూల్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ సైనికుల సంఘం నాయకులు